క్లుప్తంగా

దాతలు స్ఫూర్తిగా నిలవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : దాతలు తమ సేవా కార్యక్రమాల ద్వారా ఇతరులకు స్ఫూర్తిదాయకంగా నిలవాలని బాలాజీ వైద్యశాల అధినేత డాక్టర్ కృష్ణకిశోర్‌రెడ్డి పిలుపునిచ్చారు. దివంగత బీచు నాగేశ్వరరెడ్డి వర్ధంతి సందర్భంగా ప్రజల దాహార్తి తీర్చేందుకు మినరల్ వాటర్‌తో కూడిన చలివేంద్రం ఏర్పాటు చేశారు. అనంతరం ప్రేమాలయ నిరాశ్రయుల వసతి గృహంలో అన్నదానం చేశారు. అనంతరం ఆజాద్ నగర్ లోని బృందా వృద్ధాశ్రమంలో వృద్ధులకు, పలు కూడళ్లలో ఆదరణలేని నిరుపేదలకు, వికలాంగులకు అన్నదానం చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాల కమిటీ రాష్ట్ర కన్వీనర్ సింగారెడ్డి రామచంద్రారెడ్డి, బీచు నాగేశ్వరరెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. బీఎస్‌ఆర్ ఫౌండేషన్ వలంటీర్లు పాల్గొన్నారు.

పేదలకు పండ్లు పంపిణీ

వైవీయూ: కడప నగరంలోని ఆర్‌టీసీ బస్టాండు, పాతబస్టాండు సమీపంలోని పేదలకు కడప ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో అరటిపండ్లు, మల్టీవిటమిన్ ప్యాకెట్, మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల జాయింట్ సెక్రటరీ కోట్ల సరస్వతి, డైరెక్టర్ ఎం. వివేకానందరెడ్డి మాట్లాడుతూ వేసవిలో పేదలకు తమవంతుగా పండ్లు, బిస్కట్లు, మజ్జిగ అందజేసినట్లు తెలిపారు. సిబ్బంది చంద్ర ఓబులరెడ్డి, వెంకటేష్, చంద్ర, సంధ్యారెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో దోష నివారణ పూజలు

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలు నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజా విధానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. భక్తులు ఈ సందర్భంగా అమ్మవారికి నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కుకున్నారు.

ఎంబ్రాయిడరీ, ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌లలో శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, గర్ల్స్ ఐటీఐ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన మహిళలకు ఎంబ్రాయిడరీ, ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌లలో 30 రోజులపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కెనరా బ్యాంకు రూరల్ సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8 నుంచి ప్రారంభమయ్యే ఈ శిక్షణకు 18 నుంచి 45 ఏళ్లలోపు కలిగి ఉండాలన్నారు. ఇతర వివరాలకు 9440905478, 6302833546 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నివాళి

చెన్నూరు : చెన్నూరు మైనార్టీ కాలనీలో నివాసముంటున్న పార్టీ నేత గౌస్ తల్లి షకీనా మంగళవారం మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి గౌస్ నివాసానికి వెళ్లి షకీనా మృతదేహానికి ఘనంగా నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ఆర్టీపీపీ రోడ్డులోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనా మహోత్సవాల సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. తెల్లవారుజామున వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం సామూహికంగా సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఆచరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

నేడు ఉద్యోగ విజయోత్సవం

కమలాపురం : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం ఉద్యోగ విజయోత్సవం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.బి.వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్, ట్రైనింగ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి సీకే దిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి హాజరుకానున్నారని ఆయన తెలిపారు. నిరుద్యోగులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన తెలిపారు.

శేష వాహనంపై చెన్నకేశవుడు

రాజుపాళెం : మండలంలోని వెల్లాల బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం రాత్రి శేష వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ స్వామి విగ్రహాలను పల్లకిపై పురవీధుల్లో వైభవంగా ఊరేగించారు. ముందుగా శ్రీచెన్నకేశవ, సంజీవరాయ స్వాముల వారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్‌పర్సన్ కానాల విజయలక్ష్మి, బలరామిరెడ్డి, ఈఓ బీవీ నరసయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రామమోహన్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బాధితులు నిర్భయంగా ఫిర్యాదు చేయండి

కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్


బాధితులతో మాట్లాడుతున్న డీఎస్పీ ఎం.డి షరీఫ్

కడప అర్బన్ : కడప పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్‌స్టేషన్లకు బాధితులు మొదట వెళ్లి ఫిర్యాదులు చేయాలని లేక నేరుగా తమనైనా సంప్రదించవచ్చని కడప డీఎస్పీ ఎం.డి. షరీఫ్ తెలియజేశారు. మంగళవారం తమ కార్యాలయానికి వివిధ ఫిర్యాదులతో వచ్చిన వారి అర్జీలను స్వీకరించారు. 'స్పందన'లో ఎస్పీ నుంచి రెఫర్ చేసిన ఫిర్యాదులను పరిశీలించారు. బాధితుల ఫిర్యాదులను ఓపికతో విని వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేశారు. భార్యాభర్తలు ఇద్దరు వచ్చి తమ మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయనీ ఫిర్యాదు చేయగా వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. సర్దుకుపోతే సంసారం సాఫీగా సాగుతుందని హితబోధ చేశారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు

కడప నగరంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలైన మట్కా, క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్, గంజాయి విక్రయం,కొనుగోలుకు పాల్పడితే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని డీఎస్పీ ఎం.డి షరీఫ్ హెచ్చరించారు. కడప ఒన్‌టౌన్ పరిధిలో మట్కా రాస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో కడప నగరం గరీబ్‌షా వీధికి చెందిన షేక్ జాఫర్‌హుసేన్, రవీంద్రనగర్ మురాదియానగర్‌కు చెందిన షేక్ నాయాబ్ రసూల్, ఆర్.కెనగర్‌కు చెందిన షేక్ మదార్ సాహెబ్ ఉన్నారు. వీరి వద్ద నుంచి రూ. 57,500 నగదును, మట్కా స్లిప్‌లను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం రాత్రి డీఎస్పీ తన కార్యాలయంలో వివరాలను వెల్లడించారు. వీరిని అరెస్ట్ చేయడంలో కృషి చేసిన కడప ఒన్‌టౌన్ సీఐ ఎన్.వి నాగరాజు,చెన్నూరు ఎస్ఐ శ్రీనివాసుల రెడ్డి , క్రైం పార్టీ ఏఎస్ఐ మల్లయ్య, హెడ్‌కానిస్టేబుల్ పాకా వరప్రసాద్, కానిస్టేబుళ్లు ఎస్. ఖాదర్‌హుసేన్, కిరణ్‌లను అభినందించారు.

తాలూకా పోలీసులపై చర్యలు తీసుకోవాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : వామపక్ష నాయకులను కులం పేరుతో దూషించి కొట్టిన తాలూకా పోలీసులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి. ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఏప్రిల్ 29న బీజేపీ ప్రచార వ్యతిరేక విధానాలపై చేపట్టిన ప్రచార భేరి సందర్భంగా ఐటీఐ సర్కిల్ వద్ద శాంతియుతంగా సభను నిర్వహించేందుకు సీపీఐ నాయకులను పోలీస్ స్టేషన్ తరలించి చిత్రహింసలు పెట్టారన్నారు. ఈవిషయమై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా ఏఎస్పీ తుషార్ దూడి, కడప డీఎస్పీ షరీఫ్‌లకు మంగళవారం ఫిర్యాదు చేశారు. వామపక్ష నాయకులపై దాడికి పాల్పడిన తాలూకా సీఐ, ఎస్ఐ చర్యలు తీసుకోవాలని కోరారు. అఖిలపక్ష నాయకులు చంద్ర, సత్తార్, మనోహర్, గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

నలుగురు జూదరుల అరెస్ట్

కడపఅర్బన్: నగరంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రామకృష్ణ జూనియర్ కళాశాల సమీపంలో జూదమాడుతున్న నలుగురిని మంగళవారం అరెస్ట్ చేసినట్లు సీఐ సయ్యద్ హాసం తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 3700 నగదును మట్కా స్లిప్‌లను సీజ్ చేశారు.

'నాడు- నేడు' విధుల్లో నిబంధనలను సడలించాలి

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలోని నాడు- నేడు రెండవ విడత పనులు జరుగుతున్న పాఠశాలల్లో హెచ్‌ఎం, ఉపాధ్యాయులందరూ వేసవి సెలవుల్లో తప్పనిసరిగా హాజరు కావాలన్న నిబంధనలను సడలించాలని ఎస్టీయూ నాయకులు కోరారు. ఈ విషయమై మంగళవారం పాఠశాల విద్య ఆర్‌జేడీ వెంకటకృష్ణారెడ్డిని తమ కార్యాలయంలో కలిసి వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, చెన్నకేశవరెడ్డి మాట్లాడుతూ నాడు- నేడుతో మౌలిక వసతులపరంగా పాఠశాలలు అభివృద్ధి చెందడం సంతోషకరమని, అందుకు ఉపాధ్యాయులుగా అన్ని రకాలుగా సహకరిస్తామన్నారు. కానీ సెలవు రోజుల్లో వంతుల వారీగా రోజుకొకరు హాజరై ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేయాలనే నిబంధనలు విధించడం సమంజసం కాదన్నారు. రాష్ట్ర నాయకులు రఘునాథ రెడ్డి, బాలగంగిరెడ్డి, ఇలియాస్ బాషా, రవిశంకర్‌రెడ్డి, జిల్లా నాయకులు సుదర్శన్‌రెడ్డి, రెడ్డెన్న, కడప మండల నాయకులు సాదిక్ అలీ, తులసీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఉద్యమ మార్గదర్శకుడు దాచూరి


దాచూరి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయ ఉద్యమ మార్గదర్శకుడు, విద్యారంగ సంక్షేమ కోసం అలుపెరగని పోరాటాలు చేసిన మహోన్నత వ్యక్తి అమరజీవి దాచూరి రామిరెడ్డి అని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు అన్నారు. దాచురి రామిరెడ్డి ఏడవ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం కడప యూటీఎఫ్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాచూరి రామిరెడ్డి ఉపాధ్యాయ, విద్యారంగ సంక్షేమానికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. జిల్లా కార్యదర్శులు మస్తానయ్య, ఏజాస్, అహ్మద్ నాయకులు దేవదత్తం, శ్యాంసుందర్, జహీర్ అబ్బాస్, సీవీఎస్ఎన్‌బాబు, అబ్దుల్‌గని, జాబీదు, ప్రకాష్ బాబు, గౌరీ శంకర్ పాల్గొన్నారు.

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ క్యాంపు


సర్టిఫికెట్లతో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

వైవీయూ: కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో పది రోజులుగా నిర్వహించిన ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపు మంగళవారం ముగిసింది. కడప ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ జి. రవీంద్రనాథ్, వైస్ ప్రిన్సిపాల్ ఎం. రమేష్, వైవీయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్. వెంకట్రామిరెడ్డి ముఖ్యఅతిథులుగా విచ్చేసి ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు సర్టిఫికెట్లు అందజేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అంకాల్ నాగరాజు, శివరామకృష్ణ, సావిత్రి, నరసింహారావు, రవిశేఖర్, ఆర్. నీలయ్య, శ్రీనీత పాల్గొన్నారు.

డీఎస్సీ-98 అభ్యర్థులందరికీ ఉద్యోగాలు ఇవ్వాలి

కడప ఎడ్యుకేషన్ : డీఎస్సీ–1998 అర్హులైన అందరికీ ఉద్యోగాలు ఇవ్వాలని సోమవారం కడప కలెక్టరేట్, డీఈఓ కార్యాలయం ఎదుట అభ్యర్థులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 580 మంది అభ్యర్థులకు సంబంధించిన జాబితాను వెరిఫికేషన్ ద్వారా ముఖ్యమంత్రి కార్యాలయానికి విద్యాశాఖ అధికారులు పంపించారన్నారు. జిల్లాలో కేవలం 172 మందికి మాత్రమే ఉద్యోగాలు ఇస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా జిల్లాలో మిగిలిన డీఎస్సీ 98 అభ్యర్థులు ఉద్యోగాలకు దూరమయ్యే పరిస్థితి నెలకొందని అన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్పందించి 98 అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అభ్యర్థులు మురళీమోహన్‌రెడ్డి, ఎరుకలయ్య, చంద్రమౌళి, శివాజీ, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈశ్వరీదేవిమఠంలో మహాప్రసాదం పంపిణీ


ప్రసాదం పంపిణీ చేస్తున్న మఠాధిపతుల అమ్మవారు విజయమ్మ

బ్రహ్మంగారిమఠం : జగన్మాత శ్రీ ఈశ్వరీదేవిమఠంలో మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించిన శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజ మహోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఉదయం శ్రీ గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామికి ప్రభాతసేవ, కుంకుమార్చన తదితరాలు చేపట్టారు. గుడి ఉత్సవం కమనీయంగా జరిగింది. మఠాధిపతులు శ్రీ వీరశివకుమారస్వామి ఆధ్వర్యంలో పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవానికి ప్రకాశం జిల్లా బచ్చలకూరపాడు గ్రామానికి చెందిన మాచా భక్తుని వీరభ్రమరాచార్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. మధ్యాహ్నం మహాప్రసాదం వినియోగం కార్యక్రమం నిర్వహించారు. మహాప్రసాదానికి పులివెందుల నియోజకవర్గం లోపట్నూతల గ్రామానికి చెందిన పుల్లకూర వెంకటపతి, అచ్చమ్మ, రామయ్య, పార్థసారథివీరుడు ఉభయదారులుగా వ్యవహరించారు. భక్తుల కోసం సౌకర్యాలను ఆలయ ఈఓ బీవీ జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారు.

బద్వేలు డిపోను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తాం

బద్వేలు అర్బన్ : బద్వేలు డిపోలో నెలకొన్న సమస్యలన్నింటినీ పరిష్కరించి అభివృద్ధి చేస్తామని ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం బద్వేలు డిపోను ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బద్వేలు డిపోలో కొన్నేళ్లగా నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు తన దృష్టికి తీసుకువచ్చారని, ఆ సమస్యను వారం రోజుల్లో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. బద్వేలు డిపోకు అత్యాధునిక వసతులతో నూతన భవనం నిర్మించేందుకు అంచనాలు తయారు చేయమని ఇప్పటికే అధికారులను ఆదేశించామని, అంచనాలు పూర్తయిన వెంటనే బద్వేలు డిపోకు నూతన భవనం నిర్మిస్తామని తెలిపారు. అలాగే ఆర్టీసీ బస్టాండు బయటి భాగంలో ఉన్న గదులను సైతం తొలగించి నూతన గదులను నిర్మించి ఎవరైతే ప్రస్తుతం అద్దెకు ఉంటున్నారో తిరిగి వారికే కేటాయిస్తామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ బద్వేలు సమీపంలో సెంచరీ ప్యానల్ పరిశ్రమ ఏర్పాటైన నేపథ్యంలో బద్వేలు డిపోలో మెరుగైన వసతులు కల్పించాల్సిన అవసరం ఉందని ఆర్టీసీ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లగా.. వీలైనంత త్వరగా బద్వేలు డిపోను ఆదర్శ డిపోగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. పీఆర్‌ఆర్‌డీ ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి, అడా చైర్మన్ గురుమోహన్, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త రమణారెడ్డి, సివిల్ సప్లెస్ కార్పొరేషన్ డైరెక్టర్ సుందర్‌రామిరెడ్డి, గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులు బంగారుశీనయ్య, మున్సిపల్ వైస్‌చైర్మన్ గోపాలస్వామి, మార్కెట్ కమిటీ చైర్మన్ పుత్తాలక్ష్మీదేవి శ్రీరాములు, పాల్గొన్నారు.

ఉత్సవ విగ్రహాలను అందజేస్తా

- ఆలయాల నిర్మాణానికి రూ.70 కోట్లు వెచ్చించాం
- ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

లింగాల : శ్రీసీతారామ లక్ష్మణసమేత ఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహాలను వేద పండితులకు వితరణగా అందజేస్తామని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి తెలిపారు. మంగళవారం దిగువలింగాల గ్రామంలో పునఃనిర్మించిన కోదండరామాలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీని వేద పండితులు పూర్ణ కుంభంతో ఆహ్వానించారు. ఆయన సీతారాముల కల్యాణానికి పట్టు వస్త్రాలను బహుకరించారు. అనంతరం యాగశాలలో పూర్ణాహుతి గావించారు. ఈ సందర్భంగా పంచాంగం రామ్‌కుమార్ శర్మ ప్రతి పౌర్ణమి రోజున ఒక్కొక్క గ్రామంలో సీతారాముల కల్యాణం నిర్వహించేందుకు ఉత్సవ విగ్రహాలను అందించాలని ఎంపీని కోరగా ఆయన స్పందిస్తూ ఉత్సవ విగ్రహాలను వితరణగా అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా ఆలయాల పునఃనిర్మాణానికి, నూతన ఆలయాల నిర్మాణానికి సుమారు రూ.70 కోట్లు వెచ్చించామన్నారు. శ్రీగండి ఆంజనేయస్వామి ఆలయానికి రూ.15 కోట్లు వెచ్చించామన్నారు. అదే విధంగా మండల కేంద్రంలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని, లింగాల కుడికాలువ నుంచి లింగాల చెరువులకు ఎత్తిపోతల పథకాల ద్వారా నీటిని అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ పి.వి.సుబ్బారెడ్డి, యూత్ కన్వీనర్ మనోహర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు బాబురెడ్డి, వైఎస్సార్‌సీపీ కడప పార్లమెంటరీ కన్వీనర్లు సారెడ్డి చంద్రశేఖరరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ అనసూయమ్మ, కొండారెడ్డి, వివిధ గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

వల్లూరు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న కోదండరామాలయ దశ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు సీతారామలక్ష్మణ ఆంజనేయ స్వాములకు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు జరుగుతాయి. మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. రాత్రి భజన కార్యక్రమాలు ఉంటాయన్నారు.

బండలాగుడు పోటీలు : వేడుకల్లో భాగంగా బుధవారం ఉదయం 8 గంటల నుంచి ఆరు పళ్ల విభాగం వృషభ రాజములచే బండలాగుడు పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి రూ.30 వేలు, ద్వితీయ బహుమతి రూ.25 వేలు, మూడవ బహుమతి రూ.20 వేలు, నాలుగవ బహుమతి రూ.15 వేలు, ఐదవ బహుమతి రూ.10 వేలు, ఆరవ బహుమతి రూ.8 వేలు, ఏడవ బహుమతి రూ.5 వేలు, ఎనిమిదవ బహుమతి రూ.3 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

నేడు గుంతచీపాడులో బండలాగుడు పోటీలు

చాపాడు : మండల పరిధిలోని గుంతచీపాడు గ్రామంలో బుధవారం ఓల్డ్ కేటగిరి ఎద్దులకు బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో రుక్మిణీ వేణుగోపాల స్వామి సహిత గరుత్మాంతా మహా కుంభాభిషేక మహోత్సం సందర్భంగా బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. పోటీలలో గెలుపొందిన ఎద్దుల యజమానులకు రూ.50వేలు, రూ.40వేలు, రూ.30 వేలు, రూ.0వేలు, రూ.10వేలు, రూ.5 చొప్పున నగదు బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు.

భూముల ధరలపై సమీక్ష

ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు మండల పరిధిలోని వ్యవసాయ, వ్యవసాయేతర భూములతోపాటు రాష్ట్ర, జాతీయ రహదారుల సమీపంలో ఉన్న భూముల ధరలపై సబ్ రిజిస్ట్రార్ రామలక్ష్మమ్మ మంగళవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. మండల రెవెన్యూ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో సబ్ రిజిస్ట్రార్ తహసీల్దార్ నజీర్ అహ్మద్, వీఆర్‌ఓలతో చర్చించారు. దొరసానిపల్లె, ప్రొద్దుటూరు, కొత్తపల్లె, తాళ్లమాపురం, రామేశ్వరం, సర్విరెడ్డిపల్లె, మోడంపల్లె ప్రాంతాల్లో భూముల ధరలు ఏవిధంగా ఉన్నాయి, వ్యవసాయేతర భూముల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మార్కెట్ ధరలకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపేందుకు ఈ సమీక్ష చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు మనోహర్‌రెడ్డి, సుదర్శన్, సతీష్, ఆర్ఐ నాగమోహన్‌రెడ్డి, ఆయా గ్రామాల వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

నేడు సెబ్ స్టేషన్‌లో వాహనాల వేలం

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక జమ్మలమడుగు రోడ్డులోని స్పెషల్ బ్యూరో ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయ ఆవరణలో బుధవారం వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను బహిరంగ వేలం వేయనున్నట్లు సెబ్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వా రు బహిరంగ వేలంలో పాల్గొనాలని కోరారు. మరిన్ని వివరాలకు సెబ్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

'ముద్రగడ'పై కేసు కొట్టివేత హర్షణీయం


ముద్రగడపై కేసు కొట్టివేసినందుకు వేడుకలు నిర్వహిస్తున్న బలిజ సంఘ నేతలు

కడప కల్చరల్ : కాపు ఉద్యమ నాయకుడు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభంపై తుని రైలు దహనం కేసు కొట్టివేయడంపై కడప నగరానికి చెందిన బలిజ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. మంగళవారం స్థానిక కృష్ణా సర్కిల్‌లోని శ్రీకృష్ణ దేవరాయులు విగ్రహం వద్ద బలిజ అభ్యుదయ సేవా సమితి (బాస్) అధ్యక్షులు దాసరి శివప్రసాద్ ఆధ్వర్యంలో పలువురు బలిజ నేతలు సమావేశమై రాయల విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి కేక్ కట్ చేసి పంచుకున్నారు. ముద్రగడ పద్మనాభం 2016 జనవరి 30న తలపెట్టిన కాపు గర్జన సందర్భంగా నాడు తుని రైలు దహనం ఘటనతో ఆయనకు ముడిపెట్టి మరికొందరితో కలిసి ఆయనపై అక్రమ కేసు నమోదు చేశారని, దాన్ని సోమవారం కొట్టివేయడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కేసులో ఉన్న అందరినీ నిర్దోషులుగా ప్రకటిస్తూ కోర్టు నిర్ణయం తీసుకోవడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో బాస్ సంస్థ గౌరవాధ్యక్షులు ఏనుగుల వెంకట సుబ్బయ్య, రాయలసీమ సంక్షేమ సంఘం అధ్యక్షులు రాము, కొమ్మినేని రాఘవేంద్ర, డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొండయ్య, ఎన్ఆర్ఐ ట్రస్టు చైర్మన్ తోటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : తాము నిర్వహిస్తున్న వేసవి శిక్షణను అన్ని వర్గాల వారు సద్వినియోగం చేసుకోవాలని పీఆర్ కంప్యూటర్ సొల్యూషన్స్ సంస్థ ఎండీలు రెడ్డెయ్య, రెడ్డిరాణి, పరిమళ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో కొత్తగా ప్రారంభించిన పీఆర్ కంప్యూటర్ సొల్యూషన్స్‌లో పేద విద్యార్థులు కంప్యూటర్ విద్యను నేర్చుకునేందుకు అవకాశాన్ని కల్పిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా పేద విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు వారు తెలిపారు. ఉపాధి పొందేందుకు అవసరమైన కంప్యూటర్ కోర్సులు, స్పోకెన్ ఇంగ్లీషు, కెరీర్ గైడెన్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై శిక్షణ ఇస్తామన్నారు. 5 నుంచి డిగ్రీ వరకు చదువుకున్న వారు ఇందుకు అర్హులన్నారు.

కార్యాలయాల్లో పనిచేసే వారికి, గృహిణిలకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామన్నారు. పూర్తి వివరాలకు 76719 17692 నెంబరులో సంప్రదించాలని వారు కోరారు.

పొంచిఉన్న ప్రమాదం!


ఆర్టీసీ బస్టాండ్ వద్ద మూత సరిగా లేని డ్రైనేజీ మ్యాన్‌హోల్

కడప ఎడ్యుకేషన్ : కడప ఆర్టీసీ బస్టాండ్ వద్ద ప్రధాన రహదారిలో మ్యాన్ హోల్ రూపంలో ప్రమాదం పొంచి ఉంది. మ్యాన్‌హోల్‌కు ఏర్పాటు చేసిన పైకప్పు సరిగా లేకపోవడంతో కొంతభాగం తెరుచుకుని ఉంది. ఆ దారిన రోజుకు వందల మంది ప్రజలు వెళుతూ ఉంటారు. ఏమాత్రం అజాగ్రత్తగా నడిచినా ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. సంబంధిత కార్పొరేషన్ అధికారులు స్పందించి ఆ మ్యాన్ హోల్‌కు సరిపడే మూతను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

బ్రహ్మంగారి సన్నిధిలో ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి

బ్రహ్మంగారిమఠం : వీరబ్రహ్మేంద్రస్వామిని మంగళవారం ఏపీఎస్‌ఆర్ ఆర్టీసీ రాష్ట్ర చైర్మన్ ఎ.మల్లికార్జునరెడ్డి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఫిట్ పర్సన్ శంకర్ బాలాజీ, మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి దర్శనం అనంతరం తీర్థ ప్రసాదాలు అందించి సత్కరించారు. చైర్మన్ వెంట రాష్ట్ర ఉద్యానవన సలహాదారు ప్రసాద్‌రెడ్డి స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి బ్రహ్మంగారిమఠం నుంచి హైదరాబాద్‌కు బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని ఆర్టీసీ చైర్మన్‌ను కోరారు. ఆర్టీసీ ఈడీ గోపినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

అరటి పరిశోధనా కేంద్రం పరిశీలన

పులివెందుల రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లె సమీపంలో నిర్మిస్తున్న అరటి పరిశోధనా కేంద్రాన్ని మంగళవారం మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, సీఈ శ్రీనివాస్, ఏడీ వెంకటేశ్వర్లు, డీహెచ్‌ఓ మైఖేల్‌రాజీవ్, ఏడీహెచ్ సుభాషిణి, డీఈ షాహిం, ఈఈ వెంకటేశ్వరరావు, విజిలెన్స్ జెడీ రాజశేఖర్‌లు పరిశీలించి మాట్లాడారు. రూ.13 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఏసీ గోదాములలో రైతులు అరటి నిల్వ చేసుకునేందుకు వీలుగా నిర్మించడం జరుగుతుందన్నారు. ఈ పనులన్నింటిని రెండు మాసాల నాటికి పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. రూ.70లక్షల వ్యయంతో అరటి జ్యూస్, అరటి చిప్స్ తయారు చేసే కేంద్ర నిర్మాణ పనులను పరిశీలించారు.

అగస్త్యేశ్వరస్వామి ఆలయ పాలకమండలి ఏర్పాటు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు పట్టణంలోని శ్రీఅగస్త్యేశ్వరస్వామి ఆలయ నూతన పాలకమండలిని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం సోమవారం జీఓఆర్‌టీ నంబర్ 419ని జారీ చేసింది. ఆలయ పాలకమండలి సభ్యులుగా కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఎం.మల్లికార్జున శెట్టి, జి.గోవర్దన్ రెడ్డి, కె.వెంకటసుబ్బయ్య, సీఏ నాగలక్షుమ్మ, ఎ.నాగేశ్వరి, డి.భారతి, బి.వెంకటేశు, పి.సావిత్రమ్మ, టి.మహేశ్వరశర్మను నియమించారు. త్వరలో జరగనున్న ప్రమాణ స్వీకారోత్సవంలో కొత్తమిద్దె రఘురామిరెడ్డిని ఆలయ పాలకమండలి చైర్మన్‌గా ఎన్నుకోనున్నారు. ఈ నేపథ్యంలో కొత్తమిద్దె రఘురామిరెడ్డి, మల్లికార్జున శెట్టి తదితరులు మంగళవారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి ఒక్కరి ఆర్థిక బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి


ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె : కుటుంబంలోని ప్రతిఒక్కరినీ ఆర్థికంగా బలోపేతం చేయడమే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, సీకేదిన్నె జడ్పీటీసీ పి.నరేన్ రామాంజులరెడ్డిలు తెలిపారు. మంగళవారం కొలుములపల్లె పంచాయతీ పరిధిలోని లింగారెడ్డిపల్లె, లక్కిరెడ్డిపల్లె గ్రామాల్లో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ప్రతి కుటుంబానికి కుల, మత, రాజకీయ భేదాలు లేకుండా సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. గ్రామ సచివాలయాల ద్వారా ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా అధికారులు కృషి చేస్తున్నారన్నారు. గ్రామంలో నూతన రోడ్లు, పింఛన్లు, రేషన్ కార్డులు, ఇంటి స్థలాలు, నూతన పక్కాగృహాలు కావాలని ఎమ్మెల్యే దృష్టికి ప్రజలు తీసుకువచ్చారు. ఆయన అక్కడే ఉన్న అధికారులతో చర్చించి పరిష్కరించాలని అదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడ ప్రభాకర్‌రెడ్డి, కో–కన్వీనర్ కళా యాదవ్, మాజీ కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, సింగిల్ విండో ప్రెసిడెంట్ గజ్జల శ్రీరామిరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు గజ్జల సుధాకర్ రెడ్డి, ఎంపీటీసీలు నాగరాజు, వెంకటరెడ్డి, సర్పంచ్‌లు రాజశేఖర్‌రెడ్డి, మల్లిఖార్జున యాదవ్, సుబ్బరాయుడు, సురేంద్రారెడ్డి, రాష్ట్ర ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.